క్లుప్తంగా

21న డీఎస్సీ అభ్యర్థులకు అవగాహన సదస్సు

తెనాలి: డీఎస్సీ పరీక్ష రాయనున్న అభ్యర్థులకు ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్, జనవిజ్ఞానవేదిక సంయుక్త నిర్వహణలో ఈనెల 21వ తేదీన తెనాలిలో ఉచిత అవగాహన సదస్సును నిర్వహించనున్నారు. ఆయా సంస్థల నాయకులు ఎండీ గయాసుద్దౌలా, టీఎస్ఎస్ఎల్ మల్లేశ్వరరావు, అహ్మద్ హుస్సేన్, కామాక్షి, కె.సాంబశివరావు, అమిరిశెట్టి శ్రీధర్, అంగిరకుల ఉమామహేశ్వరరావు, కుర్రా శ్రీనివాసరావు తదితరులు వివరాలను తెలియజేశారు. స్థానిక కొత్తపేటలోని ఎన్జీఓ కల్యాణమండపంలో సాయంత్రం 5.30 గంటల నుంచి 8 గంటల వరకు జరగనున్న సదస్సులో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు డీఎస్సీ పరీక్షపై అవగాహన కల్పిస్తారన్నారు. పరీక్ష విధివిధానాలు, ఎలా చదవాలి? ఏమేం పుస్తకాలు చదవాలి? అనేదానిపై వివరిస్తారని ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం అభ్యర్థులకు సూచనలు, సలహాలను ఇస్తారని, 160 పేజీల విద్యా మనో విజ్ఞానశాస్త్రం (ఎడ్యుకేషనల్ సైకాలజీ) పుస్తకాన్ని ఉచితంగా అందిస్తామని తెలిపారు. వివరాల కోసం 94404 52406 నంబరును సంప్రదించాలని సూచించారు.

విభజన హామీలను అమలు చేయాలి

తెనాలిఅర్బన్: రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఊరూరా జనవిజ్ఞానం సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరెడ్డి కోరారు. చైతన్య ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆదివారం సంస్థ ప్రతినిధులు తెనాలి వచ్చారు. రాష్ట్రంలోని సమస్యలు, చేయాల్సిన అభివృద్ధిపై రూపొందించిన కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విభజన సమయంలో ఇచ్చిన హామీలను కేంద్రం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు యువతకు కల్పించాలన్నారు. అమరావతిలో 25 అడుగుల ఘంటసాల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, కళాక్షేత్రాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు, ఘంటసాలకు భారతరత్న ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో తెనాలి కో–ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ రావూరి శివకృష్ణ, ప్రజాస్వామ్య ఐక్యవేదిక నాయకులు భీమవరపు బ్రహ్మానందరెడ్డి, జి.రేణుకయ్య, ఎం.లక్ష్మణస్వామి, బాబుప్రసాద్, పుల్లగంటి శ్రీనివాస్, ఇంటూరు గోపి, సాయిబాబు, వేదాంత, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులు



తెనాలి: సీపీఎం తెనాలి ఏరియా కమిటీ ఆధ్వర్యంలో రాజకీయ శిక్షణా తరగతులు ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగాయి. వర్తమాన, ఆర్థిక, రాజకీయ పరిణామాలపై పార్టీ కేడర్‌కు అవగాహన కల్పించి, పార్టీ సభ్యుల చైతన్య స్థాయి పెంచటం, కార్యకర్తలు ప్రజాసమస్యలపై చురుగ్గా పని చేయటానికి అనుగుణంగా ఈ తరగతులు ఉంటాయని పార్టీ కార్యదర్శి కొల్లిపర బాబుప్రసాద్ చెప్పారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.భావన్నారాయణ, కేబీప్రసాద్ తరగతులు బోధించారు. షేక్ హుస్సేన్‌వలి ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు.

ధ్యానంపై అవగాహన ర్యాలీ

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లిలో ఆదివారం ధ్యానంపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ముఖ్యఅతిథి సాయిరాం ధూళిపాళ్ల మాట్లాడుతూ మాట్లాడుతూ ధ్యానం అనేది ఇప్పుడున్న తరానికి ఎంతో అవసరమని, ప్రస్తుతం యువతీ యువకులు ఒత్తిడుల మధ్య పనిచేస్తున్నారని ఇలాంటి వారు ధ్యానం చేయడం వల్ల ఎంతో మనశ్శాంతి లభిస్తుందని అన్నారు. ప్రజలకు అవగాహన కల్పించడానికి విజయవాడ పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో సభ్యులందరూ ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాల గురించి, శాఖాహారం – అమృతాహారం అని వివరిస్తూ ర్యాలీ నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో తులసి, శ్యామలరావు, వాణిశ్రీ, రఫీ, గుంటూరు సేవాదళ సభ్యులు, శంకరావు, ఝాన్సీ పాల్గొన్నారు.

శ్రీచౌడేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు

నగరంపాలెం: స్థానిక నల్లపాడురోడ్డు సాయినగర్‌లోని మహాగణపతి కుమారస్వామి సహిత చౌడేశ్వర చంద్రశేఖర సమన్విత చక్రాలయంలో కళ్యాణ వెంకటేశ్వరస్వామి ప్రతిష్ట కృతువు, కల్యాణ మహోత్సవంలో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కారంచేడు శ్రీవశిష్ట హరేరామ జపయజ్ఞ ఆశ్రమ పీఠాధిపతి శ్రీప్రణవానందగిరి స్వామి హాజరయ్యారు. పూర్ణకుంభ పూజలు జరిగాయి. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామి వార్లను దర్శించుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ సర్వాధికార ప్రతినిధి శ్రీవిశ్వంభరానందగిరిస్వామి, ఆలయ శాశ్వత ధర్మకర్త కొమ్మన నరసింహారావు పాల్గొన్నారు.

వ్యర్థానికి అర్థం.. మొక్కలకు జీవం

- వర్మీ కంపోస్ట్‌ను ఉత్పత్తి చేస్తున్న తెనాలి మున్సిపాలిటీ
- పార్కులు, డివైడర్‌లలో మొక్కలకు ఉపయోగకరం
- ప్రజలకూ విక్రయిస్తున్న అధికారులు


వర్మీ కంపోస్టు తయారు చేసే బెడ్‌లు ఇవే

తెనాలిఅర్బన్: తెనాలి పురపాలక సంఘ పరిధిలో ఉత్పత్తవుతున్న వర్మీ కంపోస్ట్ మొక్కలకు జీవం పోస్తోంది. దీనిని కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల మొక్కల తోటలతో పాటు డివైడర్‌లలోని మొక్కలకు ఉపయోగిస్తున్నారు. దీంతో సత్ఫలితాలు వస్తున్నాయి. ఇటీవల ఇంటింటికి వెళ్లి కంపోస్ట్‌ను విక్రయించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

మొక్కలకు బలం..

తెనాలి పట్టణంలో వ్యర్థాల్లో ప్రతిరోజు కుళ్లిపోయిన పండ్లు, కూరగాయలు ఎక్కువగా వస్తుంటాయి. వాటిని బుర్రిపాలెం రోడ్డులోని కంపోస్ట్ యార్డుకు తరలిస్తారు. ఒక్కోసారి ఎక్కువ మొత్తంలో రావటంతో వాటిని పట్టణ శివారు రోడ్ల అంచున కార్మికులు గతంలో పడేసేవారు. ఇవి ప్రజలకు అసౌకర్యంగా మారటంతో ఫిర్యాదులు ఎక్కువగా వస్తుండేవి. తెనాలి పట్టణంలో నాడు పర్యటించిన పర్యావరణ ఉన్నతాధికారులు దానిని వర్మీ కంపోస్ట్‌కు ఉపయోగించుకోవాలని సూచించారు. దీంతో అప్పటి మున్సిపల్ అధికారులు 2012లో బుర్రిపాలెం రోడ్డులోని కంపోస్ట్ యార్డులో వర్మీ కంపోస్ట్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి వర్మీ కంపోస్ట్‌ను తయారు చేసి మున్సిపల్ పరిధిలోని పార్కులు, పండ్ల తోటలలో, డివైడర్‌లలోని మొక్కలకు ఉపయోగిస్తున్నారు.

వర్మీ కంపోస్ట్ తయారీ ఇలా..

వర్మీ కంపోస్ట్ తయారు చేసే బెడ్‌లో ముందుగా కొబ్బరి పీచును వేస్తారు. తర్వాత లేయర్‌లో రెండు టన్నుల కూరగాయల వ్యర్థాలను(తడి చెత్తను) పేడతో మిక్స్ చేసి దానిని నీటితో తడపుతారు. మరుసటి రోజు నుంచి దానిని ఇనుప దంతెతో కిందది పైకి..పైది కిందకి వారం పాటు తిప్పుతూ నీటితో తడుపుతూ ఉంటారు. తర్వాత వానపాములను దానిలో వేసి బాగా నీటితో తడిపిన వడ్ల గోతాలను దానిపై వేస్తారు. ఇలా నెల రోజులు ఉంచుతారు. ఇలా చేయటం వల్ల వానపాములు అక్కడున్న కూరగాయలను తిని మట్టిని విసర్జిస్తాయి. మట్టిని జల్లించి భద్రపరుచుతారు. ఆ మట్టిని వర్మీ కంపోస్ట్‌గా పిలుస్తారు. ఆ మట్టిలో నత్రజని ఎక్కువగా ఉంటుంది. దీంతో అవి మొక్కల ఎదుగుదలకు దోహదపడతాయి.



తెనాలిలోని వర్మీ కంపోస్టు యూనిట్


విక్రయించేందుకు కిలో ప్యాకెట్ల తయారీ

ఏడాదికి 10 నుంచి 12 టన్నుల ఉత్పత్తి ..

తెనాలి పట్టణంలోని మార్కెట్ పెద్దది కావటంతో అక్కడ ప్రతిరోజు రూ.లక్షల్లో కూరగాయల వ్యాపారం జరుగుతుంటుంది. దీంతో కూరగాయలు, ఆకుకూరల వ్యర్థాలు కూడా ఎక్కువగా వస్తుంటాయి. దీంతో మున్సిపల్ సిబ్బంది వాటిని సేకరించి కంపోస్ట్ యార్డుకు తరలిస్తారు. రెండు టన్నులు కాగానే వర్మీ కంపోస్ట్ తయారీని ప్రారంభిస్తుంటారు. ఇలా ఏడాదికి 10 నుంచి 12 టన్నుల వర్మీ కంపోస్ట్‌ను తయారు చేస్తుంటారు.

ఇంటింటికి విక్రయాలు...

తెనాలిలో వర్మీ కంపోస్టు ఉత్పత్తి ఎక్కువగా ఉండటంతో ఇంటింటికి దీనిని విక్రయించాలని మున్సిపల్ అధికారులు నిర్ణయించారు. దీనిలో భాగంగా నగర దీపికలతో కేవలం కిలో రూ.10కే ఇంటింటికి విక్రయించేలా చర్యలు చేపట్టారు. అంతేకాకుండా మున్సిపల్ కార్యాలయంలో విక్రయిస్తున్నారు. ప్రస్తుతం మూడు టన్నుల వర్మీ కంపోస్ట్ ఉందని అధికారులు తెలిపారు.

మొక్కల పెరుగుదలకు దోహదం..



తెనాలి పురపాలక సంఘ పరిధిలో వర్మీ కంపోస్ట్‌ను తయారు చేస్తున్నాం. ఇది మొక్కల ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడుతుంది. ఇటీవల ఉత్పత్తి పెరగటంతో కిలో రూ.10కే విక్రయిస్తున్నాం. మొక్కలు పెంచే పట్టణ వాసులు దీనిని ఉపయోగించుకోవాలి. ఎక్కువ మొత్తంలో కావాల్సిన వారు తమను సంప్రదిస్తే వారి ఇంటికే వర్మీ కంపోస్టు పంపే ఏర్పాటు చేస్తాం.

–డాక్టర్ హెలెన్ నిర్మల, ఆరోగ్యాధికారిణి, తెనాలి మున్సిపాలిటీ

పాడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి


మాట్లాడుతున్న ములకా శివసాంబిరెడ్డి

తెనాలి: ప్రభుత్వం, ప్రభుత్వరంగ సంస్థలు పాడిరైతులను ఆదుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక అయితానగర్‌లోని ఎర్రబడి సెంటర్‌లో ఆదివారం మేకల అనసూయ అధ్యక్షతన పాడిరైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాడి, పంట రైతుకు రెండు కళ్లులాంటివని చెప్పారు. పంట దెబ్బతింటే పాడి మీద అయినా కుటుంబాన్ని పోషించుకోవచ్చనే ఆశతో ఉన్న పాడిరైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పశువుల ధరలు, వరిగడ్డి, పచ్చిగడ్డి, తవుడు, దాణా ధరలతోపాటు పశువుల మందుల ధరలు కూడా ఇబ్బడిముబ్బడిగా పెరిగాయని చెప్పారు. మహిళా పాడిరైతులు గ్రూపులుగా ఏర్పడి ఐక్యంగా ఉండాలని సూచించారు. వేజెండ్ల తబిత మాట్లాడుతూ గత 15–20 ఏళ్లుగా కౌలు వ్యవసాయంతోపాటు పశుపోషణ చేస్తున్న తమకు తగిన ఆర్థికసాయం చేయాలని కోరారు. మాన్యం శ్యాంబాబు మాట్లాడుతూ గోకులం, మినీగోకులం కింద షెడ్లు, దోమతెరలు వగైరాల కోసం సబ్సిడీ, సబ్సిడీయేతర సాయం ఇవ్వాలని కోరారు. కార్యాచరణ కోసం అయిదుగురితో కమిటీ ఏర్పాటుచేశారు. సీహెచ్ మార్తమ్మ, జి.అరుణ, మేకల ప్రకాష్, అత్తోట సరోజిని, జి.సునీత, తెనాలి ఝాన్సీ పాల్గొన్నారు.

జాతీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయండి


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నేతలు గురుబ్రహ్మం, అరుణకుమార్, తదితరులు

తెనాలిఅర్బన్: సెప్టెంబర్ 1 నుంచి 3 వరకు విశాఖపట్నంలో జరగనున్న ఏఐటీయూసీ జాతీయ సమితి సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు ఎ.అరుణకుమార్, ఉపాధ్యక్షుడు గురుబ్రహ్మంలు పిలుపునిచ్చారు. గాంధీనగర్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కును కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పాలని చూడటం దుర్మార్గం అన్నారు. కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి విశాఖ ఉక్కును సాధించుకోవడం జరిగిందని గుర్తు చేశారు. అనంతరం వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరించారు. సమావేశంలో కార్యదర్శి ఎం.హనుమంతరావు, బొల్లిముంత కృష్ణ, పరుచూరి వెంకటేశ్వరరావు, కె.మహేష్, ఐ.రాజేష్ ఖన్నా, వి.విజయ్‌కుమార్, ఎస్.అనిల్, కె.సత్య, ప్రవీణ్, వెంకటేష్, రాజా, తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధత కలిగిన సమాజసేవకుడు ఓంకార్ ప్రసాద్

అభినందన సభలో వివిధ రంగాల ప్రముఖులు


ప్రసాద్ దంపతులను సత్కరించిన అతిథులు

తెనాలి: క్రమశిక్షణ, నిబద్ధతతో జీవితాన్ని నిర్మించుకుని సమాజసేవకు ఇతోధిక సేవ చేస్తున్న కటకం వెంకట ప్రసాదరావు (ఓంకార్ ప్రసాద్) ఆదర్శప్రాయుడని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు అభినందించారు. ఓంకార్ ప్రసాద్‌గా గుర్తింపును పొందిన ప్రసాదరావు మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన సందర్భంగా ది పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ, బాల్య మిత్ర మండలి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం అభినందనసభ నిర్వహించారు. ముత్యంశెట్టిపాలెంలోని ది పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ కళ్యాణమండపంలో ఏర్పాటైన సభకు సొసైటీ అధ్యక్షుడు జొన్నాదుల నరసింహారావు అధ్యక్షత వహించారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు మాట్లాడుతూ చేనేత కార్మిక కుటుంబంలో జన్మించిన ప్రసాదరావు కష్టపడి పనిచేస్తూ ఉన్నత స్థాయికి ఎదగటం గర్వకారణమన్నారు. మానవత, తెనాలి చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ మాట్లాడుతూ బాధ్యత అనే పదానికి ఓంకార్ ప్రసాద్ చిరునామాగా చెప్పారు. కోస్తాంధ్ర పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జీవి రామకృష్ణ, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత వేజళ్ల ఉమమాహేశ్వరరావు, మొవ్వా విజయలక్ష్మి స్మారక సేవాసమితి వ్యవస్థాపకుడు మొవ్వా సత్యనారాయణ, కె.రామమోహనరావు తదితరులు ఓంకార్ ప్రసాద్‌తో తమకు గల స్నేహాన్ని వివరిస్తూ, నూతన బాధ్యతల్లోనూ ఆయన రాణించగలరన్న ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. మహాత్మా సేవాశాంతి ఆశ్రమం వ్యవస్థాపకుడు వజ్రాల రామలింగాచారి, అక్కల శ్రీరామ్, జొన్నాదుల మహేష్, గొట్టిముక్కల సుబ్బారావు, తిరువీధుల నాగేశ్వరరావు, శివశంకరరావు, రాచాబత్తుని బ్రహ్మం, రాచాబత్తుని శ్రీనివాసరావు, జొన్నాదుల వెంకటేశ్వరరావు, జీఎస్‌బీ ప్రభాకరరావు, దివి పురుషోత్తం, కందుల నాగమల్లేశ్వరరావు, గోగినేని శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తెనాలిలో విఖనస జయంతి

తెనాలి: స్థానిక నెహ్రూరోడ్డులోని శ్రీరుక్మిణి సత్యభామసమేత గోవర్ధనస్వామి ఆలయంలో ప్రతిష్టాత్మకంగా విఖనస మహర్షి జయంతిని సోమవారం నిర్వహించనున్నారు. పట్టణానికి చెందిన శ్రీ వైఖానస సేవాసంఘం ఆధ్వర్యంలో సన్నాహాలు చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా శ్రావణ పూర్ణిమ రోజున వైఖానసులు మహర్షి జయంతిని నిర్వహిస్తుంటారు. ఈ పర్వదినాన్ని పురస్కరించుకొని తెనాలిలో ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచన, పంచామృత స్నాపన విశేష అర్చన కైకర్యాదులు నిర్వహించనున్నట్లు సేవా సంఘం అధ్యక్షుడు శ్రీనివాసమూర్తి తెలిపారు లోకహితాన్ని కోరుతూ నారాయణ హోమం నిర్వహిస్తామని తెలిపారు. ఉదయం 10 గంటలకు ఆచార్య స్వామి ఉత్సవమూర్తిని జింక వాహనంపై ప్రతిష్ఠించి పట్టణంలో రథోత్సవం ఉంటుందన్నారు. అనంతరం వేణుగోపాలస్వామి వారి ఆలయ ప్రాంగణంలో నిర్వహించే సభలో తిరుమల తిరుపతి దేవస్థానాల ధర్మగిరి వేద విజ్ఞానపీఠం అధ్యాపకుడు దీవి ఫణి కుమార్‌కు బిరుదు ప్రదానం చేసి ఘనంగా సన్మానించనున్నట్లు తెలిపారు. వైఖానస ఆగమ విద్యను పూర్తి చేసిన ఆగమ విద్యార్థులు నారాయణం సంతోష్, వేదాంతం కమలేష్‌ను సత్కరిస్తామన్నారు. స్థానిక బోస్ రోడ్డు లోని సీతారామమందిర అర్చకుడు అగ్నిహోత్రం నరసింహమూర్తిని అర్చక పురస్కారంతో సత్కరిస్తామని వివరించారు.

గుండెజబ్బులపై అవగాహన అవసరం



ఆరోగ్య సూత్రాలను వివరిస్తున్న సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కె.హేమ సుందర్, పక్కన సంస్థ సభ్యులు

లక్ష్మీపురం: క్రమపద్ధతిలో జీవనం ద్వారా గుండె జబ్బులకు దూరంగా ఉండవచ్చని సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కే హేమసుందర్ అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆరోగ్య సభ నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ పూర్వకాలంలో ఈ గుండెకు సంబంధించిన సమస్యలు పెద్దవారిలో ఎక్కువగా చూసేవారం, కానీ ఇటీవల శ్రమలేని పని విధానం, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, మానసిక ఒత్తిడిలో ఇతర అనారోగ్య సమస్యలు మూలంగా చిన్న వయసు వారిలో కూడా గుండెకు సంబంధించిన సమస్యలను చూస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యంగా మధుమేహం ఉన్నవారు ఛాతిలో నొప్పిగా అనిపించినప్పుడు అది గ్యాస్ నొప్పి అని అపోహ చెందక వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని కోరారు. అనంతరం అవగాహన సభ్యులు అడిగిన గుండెకు సంబంధించిన వ్యాధులకు తగు వైద్య సలహాలు, సూచనలను ఇచ్చారు. అవగాహన సభ్యులు డాక్టర్ కే హేమ సుందర్ ఘనంగా సత్కరించారు. సమావేశానికి టీవీ సాయిరాం కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా, అవగాహన సంస్థ సీనియర్ సభ్యులు ఆర్.రామచంద్ర రావు, ఫణి కుమార్, వీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చేతిరాతపై దృష్టి పెట్టాలి


ఉపాధ్యాయులతో ఉప్పాల రామమోహనరావు, క్యాలిగ్రఫీ ఫ్యామిలీ సభ్యులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి దశలోనే చేతిరాతను మెరుగుపరచుకోవడం ద్వారా చదువుపై ఏకాగ్రతతో పాటు చేతిరాతను అందంగా మార్చుకోవచ్చునని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఉప్పాల రామమోహనరావు అన్నారు. క్యాలిగ్రఫీ ఫ్యామిలీ ఆధ్వర్యంలో ఆదివారం స్తంభాల గరువులోని చేబ్రోలు పుల్లయ్య– మహాలక్ష్మి నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలలో 25 మంది ఉపాధ్యాయులతో పాటు 30 మంది విద్యార్థులకు చేతిరాత నైపుణ్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. రామమోహనరావు మాట్లాడుతూ క్యాలిగ్రఫీ ఫ్యామిలీ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 42,500 మంది విద్యార్థులతో పాటు 3,675 మంది ఉపాధ్యాయులకు చేతిరాత నైపుణ్యంలో శిక్షణ కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో చలమయ్య హైస్కూల్ హెచ్ఎం రమాదేవి, క్యాలిగ్రఫీ ఫ్యామిలీ సభ్యులు ప్రసాద్, షాజీర్, బురాన్, సత్యనారాయణ, రమేష్, చెన్నకేశవరావు, నాగలక్ష్మి, రమాదేవి, చెరుకుపల్లి రమాదేవి, శైలజారాణి పాల్గొన్నారు.

పోటీ పరీక్షల స్టడీ మెటీరియల్ అందజేత


పౌర గ్రంథాలయశాఖ డెప్యూటీ డైరెక్టర్ సీహెచ్ దీక్షితులు, గ్రంథాలయాధికారి ఎన్. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గుంటూరు ఎడ్యుకేషన్: స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో జిల్లా అటవీశాఖాధికారి పోతురాజు ఆదివారం మొక్కలు నాటించారు. ఈసందర్భంగా వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ప్రయోజనార్థం మానవత స్వచ్ఛంద సంస్థ చైర్మన్ పావులూరి రమేష్, కార్యదర్శి కోరిటపాటి సతీష్, అధ్యక్షుడు పావులూరి శ్రీనివాసరావు రూ.ఎనిమిది వేలు విలువ గల పుస్తకాలను అందజేశారు. అనంతరం నల్లపాడు ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన 30 మంది విద్యార్థులు గ్రంథాలయ పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

తెనాలిరూరల్: మండలంలోని సోమ సుందర పాలెం గ్రామంలో పేకాట శిబిరంపై పోలీసులు ఆదివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో రూరల్ ఎస్ఐ పి.కోటేశ్వరరావు తమ సిబ్బందితో దాడులు నిర్వహించారు. 10 మంది జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 27,200, సెల్‌ఫోన్లు స్వాధీనపర్చుకున్నారు. నిందితులను సోమవారం కోర్టులో హాజరుపర్చనున్నట్లు తెలిపారు.

రౌడీషీటర్లు పద్ధతి మార్చుకోవాలి



మంగళగిరి: రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు తమ పద్ధతి మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని పట్టణ సీఐ శ్రీనివాసరావు హెచ్చరించారు. ఆదివారం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రౌడీషీటర్లపై నిరంతరం నిఘా ఉంటుందన్నారు. భూదందాలు, సెటిల్మెంట్లుకు పాల్పడితే తీవ్ర చర్యలు ఉంటాయని చెప్పారు.

పెదపరిమిలో గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం

తాడికొండ: తుళ్లూరు మండలం పెదపరిమిలో గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభించినట్లు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు. సెంటర్‌లో బెంచీపై గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెంది పడిఉన్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి వెళ్లి ఆరా తీయగా వివరాలేమీ లభించకపోవడంతో పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించినట్లు చెప్పారు. మృతుడు వయస్సు 60–65 సంవత్సరాలు ఉంటుందని, గత రెండు రోజులుగా గ్రామంలో సంచరిస్తూ మద్యం తాగినట్లు స్థానికులు తెలిపారు ఆదివారం మధ్యాహ్నం మద్యంం తాగి బెంచీపై పడుకొని కదలకపోవడంతో స్థానికులు పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో స్పందించిన పోలీసులు మృతేదేహాన్ని స్వాధీనం చేసుకొని జీజీహెచ్‌కు తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు తుళ్లూరు ఠాణాలో సంప్రదించాలని సీఐ కోరారు.

సీజ్ చేసిన వాహనాలకు జరిమానా



నగరంపాలెం: మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వవద్దని నల్లపాడు పీఎస్ సీఐ వంశీధర్ తల్లిదండ్రులకు సూచించారు. శనివారం నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో వాహన తనిఖీలు చేపట్టిన విషయం విదితమే. ఈ మేరకు సీజ్ చేసిన 198 వాహనాలకు ఆదివారం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిమానా విధించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ నిబంధనలపై వాహన తనిఖీలు చేపట్టామని అన్నారు. పిల్లలకు వాహనాలు అప్పగిస్తే ప్ర మాదాలు జరిగేందుకు అవకాశాలు ఉన్నా యని పేర్కొన్నారు. అదే విధంగా నంబర్ ప్లేట్‌లేకుండా నేరాలు జరుగుతున్నాయని, ఈ క్రమంలో నేరాలు, రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేస్తున్నామని అన్నారు. ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

తుక్కుతుక్కు..



పోలీస్ స్టేషన్ వద్ద తుక్కైపోతున్న వాహనాలు

మంగళగిరి: పోలీస్ స్టేషన్ల వద్ద వాహనాలు తుక్కైపోతున్నాయి. వివిధ కేసులలో పట్టుబడ్డ వాహనాలను సీజ్ చేసి స్టేషన్ల ఎదుట రోడ్డుపై పడేస్తున్నారు. ముఖ్యంగా గంజాయి, డ్రగ్స్ కేసులలో పట్టుబడ్డ వాహనాలు విక్రయాలకు కోర్టులతో అనుమతులతో పాటు నిబంధనలు కఠినతరం కావడంతో వాహనాలు రోడ్డుపై ఉండడంతో వానకు, ఎండకు తడిచి ఎండి పాడవుతున్నాయి. ఇసుక లారీలతో పాటు ఖరీదైన కార్లు ద్విచక్ర వాహనాలు మగ్గిపోతున్నాయి. కొన్ని వాహనాలు మాయమతున్నాయనే విమర్శలున్నాయి. కొద్ది కాలం క్రితం వాహన యజమానులు కోర్టుల నుంచి అన్ని అనుమతులతో వాహనాలను తీసుకెళ్లేందుకు రాగా వారి వాహనాలు పోలీస్ స్టేషన్ వద్ద లేకపోవడంతో వాహన యజమానులు ఆందోళన చెందిన ఘటన చోటు చేసుకుంది. దీంతో కంగుతిన్న పోలీస్ అధికారులు వాహనదారులకు నచ్చచెప్పి అక్కడే కొద్దిగా బాగున్న వాహనాలను చూపించి వారికి ఇచ్చి సమస్య నుంచి బయటపడడం విశేషం. ఇప్పటికైనా ఉన్నతాకారులు జోక్యం చేసుకుని వాహనాలును యజమానులకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని లేదంటే చట్ట ప్రకారం బహిరంగవేలం నిర్వహించి వాహనాలను విక్రయించాలని కోరుతున్నారు.

ఆర్యవైశ్యులు దాన గుణానికి మారుపేరు


పేదలకు పెన్షన్ పంపిణీ చేస్తున్న శ్రీనివాస్ శరణ్, గోవర్ధన్, అవోపా ప్రతినిధులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆర్యవైశ్యులు దాన గుణానికి మారుపేరు అని శివ ఇంజినీరింగ్ అధినేత మట్టుపల్లి శ్రీనివాస్ శరణ్ పేర్కొన్నారు. అరండల్‌పేటలోని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(అవోపా) కార్యాలయంలో అవోపా గుంటూరుశాఖ అధ్యక్షుడు కేవీ బ్రహ్మం అధ్యక్షతన 108 మంది పేదలకు పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాస్ శరణ్ మాట్లాడుతూ అవోపా ద్వారా విద్య, వైద్యం అందించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా మెడిసిన్ చదివే పేద విద్యార్థికి ఐదేళ్లపాటు ఫీజులు చెల్లిస్తానని హామీ ఇచ్చారు. ప్రముఖ డాక్యుమెంట్ రైటర్ పొట్టి గోవర్ధన్ మాట్లాడుతూ ప్రతి నెలా 108 మంది పేదలకు రూ.500 చొప్పున పెన్షన్ ఇవ్వడం అభినందనీయమని అన్నారు. ఈసందర్భంగా పెన్షన్ పంపిణీ కార్యక్రమానికి ఆయన రూ.54 వేలు విరాళాన్ని అదజేశారు. కార్యక్రమంలో అవోపా ప్రతినిధి ఊటుకూరి నాగేశ్వరరావు, కార్యదర్శి రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, మద్ది సాయి రమేష్, వెంకట్రావు పాల్గొన్నారు.